## వాలి హిరణ్మయీదేవి




# లంచం మంచిదే...

ఇంట్లోనే హరితవనం సృష్టిస్తానంటూ ఉన్న పెరట్లో పూలమొక్కలు, కూరగాయ మొక్కలు, పాదులు పెట్టి ప్రతీ ఆదివారం ఆ పెరట్లో గడపటం గోపాలం అలవాటు. ఆదివారం కావడంతో పొద్దుటే పెరట్లోకి వెళ్లి కలుపుమొక్కలు ఏరేసే పనిలో మునిగాడు.

"హాయ్, గుడ్మార్నింగ్" అంటూ వచ్చాడు పక్కింటి పరమానందం.

"గుడ్మార్నింగ్" మొహం గంటు పెట్టుకొని జవాబిచ్చాడు గోపాలం. మనసులో మాత్రం వీడి మొహం కనిపించాక ఇంకేం 'గుడ్' అనుకున్నాడు.

"అన్నట్లు ఓ ఐదొందలకు చిల్లరుందా?" అడిగాడు పరమానందం.

"అబ్బే లేదు. నా దగ్గరా ఐదొందల నోటే ఉంది. అందుకే మన పాలవాడికి ఇవ్వాల్సిన రెండొందలూ ఇవ్వలేదు" అన్నాడు గోపాలం అమ్మయ్య తెలివిగా మాట్లాడాననుకుంటూ.

"అలాగా. ఆ నోట్ ఇవ్వండి. నేనూ వాడికి ఎనిమిదొందలు ఇవ్వాలి. మీవీ నావీ కలిపిచ్చేస్తే, ఇద్దరి బాకీ తీరిపోతుంది. మీకు మూడొందలు రేపు సాయంత్రంలోగా ఇస్తే సరిపోతుందిగా" అంటూ అతడి దగ్గరి నుండి ఐదొందల నోట్ తీసుకొని వెళ్లిపోయాడు పరమానందం.

తన వెనుక కిసుక్కున నవ్వు వినిపించటంతో వెనుదిరిగి చూశాడు గోపాలం.

"మీ దగ్గర్నుండి మూడొందలూ అప్పుగా ఎలా రాబట్టాడో చూశారా" అంటూ మళ్లీ నవ్వింది రాధ.

"అవునుగదూ. వీడికిక అప్పు ఇవ్వనని ప్రతిజ్ఞ చేసుకుని, ఎలా ఫూల్ అయ్యాను" అని గోపాలం నాలుక్కరుచుకున్నాడు. "అనుకున్న పని ఏదీ చేయలేరు మీరు" అని దెప్పే భార్యకి రెడ్‌హాండెడ్‌గా దొరికిపోవడం మరింత బాధని కలిగించింది.

"సర్లె. గోతి దగ్గరి నక్కలా కాచుక్కూచుంటావ్ నన్ను దెప్పడానికి" అంటూ లేని కోపం తెచ్చుకుని, ధుమధుమలాడుతూ హాల్లోకి వెళ్లి కూర్చున్నాడు.

"పక్కింటి పరమానందంకి ఉన్న తెలివితేటలూ, లౌక్యం మీకు లేవంటూ" ప్రతీ చిన్న విషయానికి అతడిని పొగుడుతూ, తనని విమర్శిస్తూ ఉండే భార్య నోరు మూయించాలని, తెలివిగా ప్రవర్తించాలని, ఎంతగానో ప్రయత్నిస్తున్నాడు గోపాలం. కానీ గజనీ దండయాత్రల ఫలితమే కనిపిస్తోంది ప్రతీసారి.

"అంకుల్, మీరివాళ ఎక్కడికయినా వెడుతున్నారా?" అంటూ వచ్చాడు చిన్నా, తన భారీకాయాన్ని మోసుకుంటూ. వాడి పేరు చిన్నాగానీ, వాడిని చూస్తే గున్నేనుగు గుర్తుకొచ్చి, 'గున్నా' అని పిలవాలని ఉంటుంది గోపాలానికి. తండ్రో ఏనుగు, తల్లో గజలక్ష్మి, వీడో పిల్లేనుగు. మొత్తానికి 'ఐరావతుల' వారన్న ఇంటి పేరుని సార్థకం చేసుకుంటున్నారు వీళ్లు అనుకున్నాడు.

"మిమ్మల్నే అంకుల్ జవాబు చెప్పరేం" అంటూ గోపాలం డొక్కలో ఓ పోటు పొడిచాడు గున్నా అదే చిన్నా.

"అమ్మో ఎముక చిట్లిపోయినట్లుందిరా దేవుడా" అనుకుంటూ బజారుకెడుతున్నా అంటే క్రితంసారిలా బజారు పనులు పురమాయిస్తాడో అనుకుంటూ- "వంట్లో బాలేదు. ఇవాల్టికెక్కడికీ కదలడం లేదురా" అన్నాడు పళ్లబిగువున కోపాన్ని ఆపుకుంటూ.

"ఐతే సరే. మేము రామోజీ ఫిల్మ్ సిటీ చూడ్డానికి వెడుతున్నాం తిరిగొచ్చేసరికి రాత్రవుతుంది. ఒకవేళ మా నానమ్మ - తాత వస్తే మిమ్మల్ని చూసుకోమన్నారు. బై" అంటూ వెళ్లాడు గు(చి)న్నా. వళ్లు మండిపోయింది గోపాలానికి. ఏ జవాబిచ్చినా ఏదో ఓ పని అంటగట్టే పరమానందం తెలివితేటలకు మళ్లీ బలి కావల్సి వచ్చినందుకు. వెనుక షరా మామూలుగా రాధ నవ్వు వినిపించడంతో ఎక్కడో కాలింది గోపాలానికి.

పోయిన వారమూ గున్నాగాడొచ్చి ఇదే ప్రశ్నేస్తే "బజారుకెడుతున్నా' అని చెప్పిన పాపానికి, నెలకి సరిపడా సామాన్ల లిస్ట్ ఇచ్చి అన్నీ బేరాలాడి మరీ తీసుకురమ్మని పురమాయించాడు. వెధవ మొగమాటం అడ్డొచ్చి కొంతా, ఊరికి చివరగా ఉన్నవి తామిద్దరి ఇళ్లే కావడాన, ఎప్పుడేమవసరం అవుతుందోనని కొంతా సర్దుకు పోవలసి వస్తోంది. పోనీ ఇల్లొదిలి ఎవరూ వెళ్లే ప్రసక్తే లేదు సొంతిళ్లు కావడాన. పోయిన్నెల్లోనూ అంతే. బజారుకెడుతున్నా అంటే పన్లేవన్నా చెబుతాడని. "ఇంట్లోనే ఉంటున్నాం" అన్నాడు.

"ఐతే మీ కారివ్వండి. యాదగిరిగుట్టకెళ్లే మొక్కుంది" అంటూ కారు తీసుకెళ్లిపోయాడు. ఇవ్వకూడదనుకుంటే 'దైవం' సెంటిమెంట్ అడ్డొచ్చింది. తిరిగి మంచి పొజిషన్లో ఇచ్చాడా అంటే అదీ లేదు. దేనికో గుద్ది హెడ్‌లైట్ పోగొట్టి వాపసిచ్చాడు. అదో ఖర్చూ భరించాల్సి వచ్చింది. పైగా భార్య సణుగుడూ - సకిలింత వినాల్సి వచ్చింది.

* * *

మరో ఆదివారం పరమానందం బారిన పడకుండా ఎలా ఉండాలని తీవ్రంగా యుద్ధ ప్రాతిపదికన ఆలోచిస్తూ గడిపేసరికి, సాయంత్రమయ్యేసరికి, భరించలేనంత తలనొప్పి వచ్చేసింది గోపాలానికి.

"ఏమోయ్. కాస్త కాఫీ పట్రా" అంటూ గట్టిగా అరిచాడు. వంటింట్లో ఉన్న రాధకు వినిపించేలా.

"ఎందుకలా గొంతుకోసిన మేకలా అరుస్తారు. మెల్లగా చెప్పొచ్చుగా" అంటూ రెండు కప్పుల కాఫీతో హాల్లోకి వచ్చింది రాధ. ఆమె వచ్చేలోపే పరమానందం దంపతులొచ్చి సోఫాలో కూర్చున్నారు.

వాళ్లుండగా తాము మాత్రమే కాఫీ తాగడం ఎబ్బెట్టుగా అనిపించి "రాధా. మరో రెండు కప్పుల కాఫీ పట్టుకురారాదూ" అన్నాడు గోపాలం. దాంతో రాధ వంటింటిలోకి వెళ్లి కాఫీ కలిపి పట్టుకొచ్చింది.

"ఇందాకటి నుండీ కాఫీపొడి అయిపోయిందండీ? కాఫీ ఎలా?" అంటూ ససపెట్టేస్తోంది మీ చెల్లెలు నీకు కాఫీ అమర్చే బాధ్యత నాది అంటూ మీ ఇంటివైపో చెవి వేశా. నీ అరుపు వినిపించి చక్కా ఇటు తీసుకొచ్చా" అన్నాడు పరమానందం,



పరమానందంగా.

రాధ, గోపాలం వంక చూసి కళ్లతోనే నవ్వింది. పుండు మీద ఎర్రటి కారం జల్లినట్లుగా ఫీలయ్యాడు గోపాలం. గొంతులోకి దిగిన కాఫీ, కషాయంలా తోచింది.

కాస్సేపు కూర్చుని చదువుకొందామంటే, పరమానందం దంపతులు వేసిన హస్కుతో కుదరక జుట్టు పీక్కున్నాడు. పీక్కున్నాక గుర్తొచ్చింది. చక్కటి తలకట్టున్న తనకి ఈ ఇంట్లోకి వచ్చిన తర్వాత బట్టతల మొదలైందని. దాంతో మరి జుట్టు పీక్కోలేక పెరట్లోకి నడిచి ఆ కోపాన్ని కలుపుమొక్కల మీద చూపించాడు గోపాలం.

"నాన్నా.. నాన్నా. నాకు స్కెచ్‌పెన్స్ కావాలి అర్జెంటుగా" అంటూ వచ్చింది పన్నెండేళ్ల రమ్య. "అదేంటమ్మా. ఎప్పుడో కొనిచ్చాగా మళ్లీ ఎందుకు?" లాలనగా అడిగాడు గోపాలం.

"ఆ బాక్స్ మన పక్కింటి రాణీ అడిగితే ఇచ్చాను వారం రోజుల క్రితం. ఇప్పుడివ్వమని అడిగితే, మా తమ్ముడెక్కడో పారేశాడు" అంటోంది అంది రమ్య దిగులుగా.

"హు.. నేనూ, రాధే గాదు. పిల్లలు గూడా వీళ్ల బారి నుండి తప్పించుకోలేక పోతున్నారు. ఎన్నాళ్లిలా? వాళ్ల దుశ్చర్యలకిక అంతం లేదా? హే.. ప్రభో..." అంటూ జుట్టు పీక్కోబోయి వివేకం హెచ్చరించడంతో ఆ ప్రయత్నం విరమించుకొని మనసులోనే బావురుమన్నాడు గోపాలం.

"రాధా, రాధోయ్" హుషారుగా అరిచాడు గోపాలం.

"ఏంటి శ్రీవారూ. అంత సంతోషంగా ఉన్నారు?" అంటూ వచ్చింది రాధ.

"రాధా, చూశావా మన పాదులు. నేనివి పెట్టినపుడు ఎందుకండీ దండుగ పనులు. పది రూపాయలు పారేస్తే కూరలు బజార్లో దొరకవేంటీ? అన్నావ్. ఇప్పుడు చూడు ఈ బుజ్జిబుజ్జి వంకాయల్ని చూడు. వీటిని గుత్తొంకాయ చేసుకు తింటే, స్వర్గం బెత్తెడు దూరంలో కనిపించదూ. ఇదుగో ఈ పొట్ల కాయలు, బీరకాయలు వారం రోజుల కల్లా అందొస్తాయి. బెండకాయలంటే మన రమ్యకి ఇష్టంగా. వచ్చేవారం మన మందరం, మనక్కావలసిన కూరగాయలు మన

పెరట్లోనే కోసుకుని, వండుకొని తినొచ్చు" అన్నాడు ఆనందంగా.

పసిపిల్లాడి మొహంలా కనిపించి ఆ మట్టున మొగుడ్ని గట్టిగా వాటేసుకొని ముద్దు పెట్టింది రాధ. దాంతో ఆడపిల్లలాగే సిగ్గుపడుతూ, మెలికలు తిరిగాడు గోపాలం.

మర్నాడు, ఏదో హాలీడే కావడంతో టీవీ ముందు సెటిల్ అయ్యాడు గోపాలం. ఎంతో ఇష్టమైన 'టామ్ ఎండ్ జెర్రీ' ప్రోగ్రాం చూడసాగాడు రమ్యతో కలిసి.

"నాన్నా. నాన్నా. ఆ జెర్రీ ఇప్పుడు అచ్చు మన పక్కింటి పరమానందం అంకుల్‌లాగే ఉంది కదూ" అంది రమ్య. దాని బారిన పడి తిప్పలు పడే 'టామ్'లో మాత్రం, తన మొహమే కనిపించింది గోపాలానికి. దాంతో ఆ ప్రోగ్రాం మీది ఆసక్తి చచ్చి ఎప్పట్లా తన హరితవనంలోకి వెళ్లిపోయాడు రిలాక్స్ అవ్వడానికి. కానీ విధి వక్రించి, అటుగా పరమానందం వచ్చి, "ఏమండోయ్ గోపాలం గారూ ఈ ఏడు సమ్మర్‌కి ఎటయినా వెడుతున్నారా?" అంటూ వచ్చి, కొత్తిమీర మడిపక్కన కూర్చుని లేతరెమ్మల్ని తుంచి తన నోట్లో వేసుకున్నాడు. గుండె గుభేలుమంది గోపాలానికి. ఏం చెబితే ఏం మూడుతుందో. పెళ్లాం సమ్మర్‌కి తన పుట్టింటికి వెడతానంటే, వెళ్లకుండా ఉండటానికి పట్టుచీర ఆశగా చూపించాడు. ఇప్పుడు వీడి మాటలు వింటే రాధకూ, రమ్యకూ బుర్రలో మళ్లీ ఏం ఆలోచనలొస్తాయో" అనుకుంటూ 'ఏం రిప్లై ఇవ్వాలి' అని మథనపడుతూంటే, అటుగా వచ్చిన రాధకి, భర్త అవస్థ చూసి నవ్వొచ్చింది.

"ఈ ఏడు మా వాళ్లింటికి వెడుతున్నాం అన్నయ్యగారూ, పిల్ల ఒకటే సతాయిస్తోంది. దాని కోరిక తీర్చడం ఈయనగారి ధర్మం కదా" అంటూ నవ్వింది రాధ, గోపాలానికి కన్నుగొట్టి.

"దీని దుంపతెగ. ఎంత తెలివి. పిల్ల కోరికంటూ దుష్టురాలు" తల్లి కోరికను కల్పింది ఇటు పక్క తననేదో గట్టున పడేస్తున్నట్లే అంటూ తను తన వాళ్లతో గడిపేలా ప్లాన్ చేస్తోంది" అనుకున్నాడు. మనసులోనే పళ్లు నూరుకుంటూ.

"ఏంటండీ నిజమేనా?" రెట్టించాడు పరమానందం.

".. మరే..మా అత్తమావలకి మమ్మల్ని చూడాలని తెగ ఆరాటంగా ఉందట. కనీసం పది పదిహేను రోజులయినా ఉండేల రమ్మంటున్నారు. గానీ అంతకాలం ఇల్లొదిలి ఎలా ఉండగలం? అందుకే ఓ రెండ్రోజులుండి వద్దాం అనుకొంటున్నాను" అన్నాడు రాధకు రెండ్రోజుల తన ఒప్పందాన్ని తెలిసేలా.

"ఇలెక్కడికి పోతుంది? మేం లేమూ చూసుకోవడానికి. కనీసం ఈ వంక చెప్పి మా ఆవిడ తిరుగుళ్లకి మందులేస్తా" అంటూ భళ్లున నవ్వాడు పరమానందం.

"ఇంకేం అన్నయ్యగారు ఇల్లు చూస్తామంటున్నారుగా మనం వెళ్లి నెల్రోజులున్నా ఇబ్బంది లేదు" అంది రాధ. దొరికిన అవకాశాన్ని పోగొట్టుకోకూడదన్నట్లు.

"మరింకేం ఇవాళే వెళ్లి టికెట్స్ బుక్ చేయిస్తే వారం కల్లా దొరుకుతాయ్ సెలవులు కదా ముందే రిజర్వేషన్ చేయించుకోవడం మంచిది" అంటూ ఉచిత సలహా ఇచ్చాడు పరమానందం.

ఇక దాంతో గోపాలానికి, రైల్వేస్టేషన్‌కి వెళ్లక తప్పలేదు. "ఐదు రోజుల తర్వాత మన ప్రయాణం. అన్నీ సర్దు" అన్నాడు గోపాలం తిరిగి వచ్చి. రాధా, రమ్యలు ఆనందంగా ఆ పన్లో లీనమైతే గోపాలం మాత్రం బాధగా నుదురు రుద్దుకున్నాడు. వెళ్లాల్సిన రోజు రానే వచ్చింది. ఆటో ఎక్కుతూ "పరమానందంగారూ ఇల్లు జాగ్రత్త. ముఖ్యంగా పెరట్లోకి ఏవీ వెళ్లకుండా చూడండి. గేట్ వేసే ఉంచండి" అంటూ ఇంకా ఏదో చెప్పబోతున్న గోపాలంతో. "మరేం ఫర్వాలేదు. మా ఇంటినీ, పెరడుని నావిగా భావించి చూసుకుంటా. మీరు నిశ్చింతగా వెళ్లి రండి" అన్నాడు పరమానందం అభయమిస్తున్నట్లు పది రోజులనుకున్నది పదిహేను రోజులైంది తిరిగి వచ్చేసరికి. స్నానమదీ చేసి పెరట్లోకి వెళ్లి నిశ్చేష్టుడయ్యాడు గోపాలం. మొక్కలూ, పాదులూ ఖాళీగా కనిపించేసరికి. "ఇంకా ఉంటే ముదిరిపోతాయని నేనూ, మా ఆవిడ మీ కూరగాయల్ని కోశాం. ఏ మాటకామాటే చెప్పుకోవాలి. పెరట్లోని కూరగాయల రుచి, కొనుక్కున్న వాటికి ఛస్తే రాదు సుమా. మొత్తానికి 'దానే దానే పే లిఖే హై ఖానే వాలోంకి నామ్' అన్నట్లు మీ కూరగాయల మీద ఈసారి మా పేరు రాసి పెట్టాడులా ఉంది ఆ బ్రహ్మ" అంటూ తన వెనుకే నిలబడ్డ పరమానందాన్ని కొట్టకుండా ఉండటానికి విశ్వప్రయత్నం చేసి, లోపలకి నడిచాడు గోపాలం. పరమానందం, ఆనందంగా వెళ్లిపోయాడు. ఎప్పట్లాగే కిసుక్కున నవ్వు వినిపించింది. "రాధ అన్నీ విన్నట్లుంది అనుకుంటూ పళ్లు నూరుకోబోయి డెంటిస్ట్ బిల్‌గా ఐదొందలు క్రితం నెల సమర్పించుకున్నది గుర్తొచ్చి, విరమించుకొన్నాడా ప్రయత్నాన్ని.

'మొగుడు కొట్టినందుక్కాదు, తోటికోడలు నవ్వినందుకు' అన్నట్లు రాధ నవ్వు, నరం మీది పుండులా సల్పింది.

## వెంకీ స్టయిల్!



***విక్టరీ వెంకటేష్ తనదైన మార్కుతో సినిమాల్లో నటించడం అందరికీ తెలుసు. అతని సినిమాల టైటిల్స్ విషయంలోనూ ప్రత్యేకత కనిపిస్తుంటుంది. గతంలో జెమిని, మల్లీశ్వరి, తులసి, లక్ష్మి.. లాంటి టైటిల్స్ ఆయన సినిమాలకు చూశాం. తాజాగా 'నాగవల్లి' అనే సినిమా వస్తోంది. ఇది చంద్రముఖి సినిమాకి సీక్వెల్ అని తెలిసిందే! అలాగే దర్శకుడు తేజతో వెంకటేష్ ఓ సినిమా చేయబోతున్నాడు. దీనికి 'సావిత్రి' అనే టైటిల్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇలా లేడీ ఓరియంటెడ్ టైటిల్స్‌తో సినిమాల్లో నటించడం వెంకీ స్టయిల్‌లో భాగంగా చెప్పవచ్చు.***

"అలా ప్రతి దానికీ నవ్వు కుంటే, వాడి బెడద వదిలేలా ఏదైనా అఘోరించరాదూ.." అన్నాడు గోపాలం దీనంగా.

"రాదు" అంది రాధ.

"ఏం- ఎందుకట?"

''అఘోరిస్తాగానీ, అందుకు మరి కాస్త ఆమ్యామ్యా కావాలి" అంది రాధ.


"వాడేమో నేనేం చెబితే ఏవిధంగా పీడించాలో పీడిస్తుంటాడు. నువ్వేమో ఏ అవకాశం దొరికితే నాకు గుండు కొట్టించాలా అని ఆలోచిస్తుంటావ్. భలే దొరికారు నా ప్రాణానికి" అంటూ కళ్లనీళ్ల పర్యంతమయ్యాడు గోపాలం.

"మరి ఇక మీదట నాది 'కోడి' మెదడని 'స్వంతంగా ఏదీ చెయ్యకు' అని అనడం మానేస్తారా?" జడ ముందుకు వేసుకొని వయ్యారంగా అడిగింది రాధ.

"మానేస్తా తల్లీ. వాడి పీడ వదిలేస్తే నువ్వెప్పట్నుండో అడుగుతున్న చంద్రహారమూ చేయిస్తాను" అంటూ నోరు జారాడు గోపాలం అనాలోచితంగా. "అయితే సరే" అభయమిచ్చింది రాధ అన్నారు.

రాధా పది రోజుల పాటు కాంప్‌కెళ్లాలి. ఎలా? ఇప్పుడే ఈ పరమానందం వాళ్లూ తిరుపతి వెళ్లారు. పోనీ మా అమ్మను నీకు సాయంగా రమ్మనిపించేదా?" అడిగాడు గోపాలం.

"ఏమక్కర్లేదు. మా మామయ్యకిక్కడికి ట్రాన్స్‌ఫరయిందట. వాళ్లకిల్లు దొరికే వరకూ, మనింట్లో ఉండమంటాను. దాంతో ఇద్దరి ప్రాబ్లెం తీరుతుంది" అంది రాధ. దాంతో సరేననక తప్పలేదతనికి.




పది రోజుల తర్వాత, కాంప్ నుండి తిరిగొచ్చిన గోపాలం, పరమానందం వాళ్లింట్లో, రాధ మేనమామ వాళ్లుండటం చూసి ఆశ్చర్యపోయాడు.

"అదేంటి? మీ వాళ్లిక్కడ?" ఆశ్చర్యంగా అడిగాడు.

"వాళ్లు ఈ ఇల్లు కొనుక్కున్నారు మరి" అంది రాధ.

"ఏంటి నిజమా?" ఆశ్చర్యంగా అడిగాడు గోపాలం.

"నాది కోడి మెదడన్నారుగా. వాళ్లు ఇల్లు అమ్ముకొని వెళ్లేలా చేశానంటే నమ్మకం కుదరడం లేదా? లేక చంద్రహారం చేయించాల్సి వస్తుందన్న భయమా?"

"అబ్బే. ఇది కలయా, వైష్ణవమాయనా" అని ఇంకా ఆశ్చర్యం నుండి తేరుకోలేక అన్నాడు గోపాలం.

"నేను మొదట్లో వాళ్లతో మీరు పడుతున్న పాట్లని 'లైట్'గా తీసుకున్నా, వాళ్లు షూరిటీతో చీటిపాడేసికొని లక్ష రూపాయల ఎగనామం పెట్టడం. మీ పేరు వాడుకొని మరో లక్ష అప్పులు చేయడం. చూసి ఇక 'సీరియస్'గా తీసుకోక తప్పదని, మా ఎస్సై మామయ్యతో సంప్రదించి ప్లాన్ వేశాను. దాని ప్రకారం, పరమానందం వాళ్లింట్లో దొంగలు పడి విలువైన సామాను ఎత్తుకెళ్లారని, అంతేగాక పరమానందంకి అప్పులిచ్చిన వాళ్లూ, లంచాలు ఇచ్చిన వాళ్లూ వాళ్లని చంపేందుకు కుట్ర పన్నుతున్నారని మావయ్యతో చెప్పించాను. దాంతో ప్రాణభయంతో, పదిహేను లక్షల విలువ చేసే ఇల్లు పది లక్షలకే మావయ్యకు అమ్మేసి, మిగిలిన సామాన్లు తీసుకొని రాత్రికి రాత్రే వెళ్లిపోయారు. తమకింత చీప్‌గా ఇల్లు దొరికేలా చేశాననో లేక మనం నష్టపోయిన సొమ్ము మనకందాలనో, మావయ్య నా పేరిట నాల్గు లక్షలు డిపాజిట్ చేశాడు. ఇక మీకు మానసికంగా, ఆర్థికంగా ఏ ఇబ్బందులూ లేవు. మనం హాపీగా ఉండొచ్చు" అంటూన్న రాధ విశ్వరూపం చూస్తూ, తను అర్జునుడిలా ఆమె ముందు మోకరిల్లాడు గోపాలం. పెళ్లానికీ లంచం ఇచ్చుకోవలసి వచ్చిందే ననుకొన్నాడు గానీ మంచి జరిగినప్పుడు 'లంచం మంచిదే' అనుకున్నాడు అదేదో యాడ్ గుర్తొచ్చి.

○



## బాలీవుడ్‌లో రామ్‌చరణ్?

రామ్‌చరణ్ తేజ త్వరలోనే ఓ హిందీ చిత్రంలో నటించే అవకాశాలున్నాయని వినిపిస్తోంది. ఫారుఖ్ కబీర్ అనే దర్శకుడు తను తీసే 'వెల్కమ్ టు జంగిల్' అనే సినిమాలో హీరోగా నటించమని రామ్‌చరణ్ దగ్గర ప్రపోజల్ పెట్టినట్టు తెలుస్తోంది. ఒరిజినల్‌గా ఈ సినిమాని హృతిక్ హీరోగా తీద్దామనుకున్న ఫారుఖ్ అతను ఒప్పుకోకపోవడంతో తన దృష్టిని చరణ్ మీదకి మరల్చాడట. ఫైట్స్ పుష్కలంగా వుండే ఈ సినిమాలో చరణ్ నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశాలు ఎక్కువగా వున్నాయిట.